# చావు ఒక్కటేనా దారి?

—పి. ఎస్. నారాయణ

రుక్మిణి రిక్షా దిగుతూనే అప్పటివరకూ చేతిలో రెడీగా పెట్టుకున్న చిల్లర డబ్బులు రిక్షా వాడి చేతిలో పెట్టేసి, ఇంటి నంబరు మరొక్కసారి చూసి గేటు తీసుకుని లోపల కాలు పెట్టింది.

చంద్రశేఖరం ఉన్నాడో, లేడో?

అతగాడు లేకపోయినా అతడి తండ్రి ఉన్నా చాలు.

మెట్లెక్కుతూండగా లోపలికి వస్తున్న రుక్మిణిని కిటికీలో నుంచి చూచి తలుపు తీసింది చంద్రశేఖరం తల్లి.

"ఎవరు కావాలి?"

"చంద్రశేఖరంగారు ఉన్నారా అండీ?"

"లేదమ్మా! అలా బజారు కెళ్ళాడు. ఒక అరగంటలో వస్తాడు!"

"పోనీయండి. చలపతిగారు ఉన్నారా?"

"ఆయనా లేరు. ఇంకా ఆఫీసునుంచి రాలేదు. రోజూ లేటుగానే వస్తారు. లోపలకు రా, అమ్మా!"

లోపలకు వెళ్ళింది రుక్మిణి.

"కూర్చో, అమ్మా!"

సోఫాలో కూర్చున్నది. "మీరు చంద్రశేఖరం గారి తల్లిగా రనుకుంటాను!" అందంగా ఉన్న ఆ గది గోడల్ని చూస్తూ అన్నది రుక్మిణి.

"అవునమ్మా!" రుక్మిణిని వింతగా చూస్తూ అన్నది ఆమె. "ఇంతకీ ను వ్వెవరివమ్మా?" అన్నది.

రుక్మిణి కాస్త తడబడింది

ఎలా చెప్పాలా అన్నట్లుగా పెదిమల్ని తడి చేసుకున్నది. "నేను బెజవాడ నుండి వస్తున్నానండీ!" అన్నది.

"ఎవ రమ్మాయివి?"

ఒక్క క్షణం ఏం చెబుదామా అని ఆలోచిస్తున్నట్లుగా ఆగి, "పద్మనాభం గారి అమ్మాయినండి. శ్యామలకు అక్కయ్యను!" అని ఆమె ముఖంలోని భావాలను చదవడానికి అన్నట్లుగా తదేకగా చూస్తూ అంది.

ఆమె ఉలిక్కి పడి కలవరపాటుతో, ఎవ్వరూ చూడగూడని మనిషిని చూచినట్లుగా తడబడుతూ ఒక అడుగు వెనక్కు వేసింది.

ఆమె గాభరాకు రుక్మిణికి నవ్వు వచ్చింది.

"పోనీ, నన్ను బయట కూర్చోమంటారా?" అన్నది లేవకుండానే రుక్మిణి.

ఆమె మాట్లాడలేదు. భయం భయంగా రుక్మిణి ముఖంలోకి చూస్తూ అవాక్కయి కూర్చున్నది.

రుక్మిణికి నవ్వాగలేదు. అంతేకాదు, మనస్సంతా అసహ్యంతో నిండిపోయింది. తను అంత భయంకరంగా కనబడుతున్నదా ఆమెకు? తనని చూస్తుంటే ఆమెకు నోటి వెంట మాటే పెగలటం లేదా?

నిజమే! అంతగా భయపడుతున్నది కాబట్టే అన్నీ స్థిరపరచుకున్న సంబంధాన్ని—తనని గురించి ఎవడో ఏదో కూయగా పుటుక్కున తెంపేసుకున్నారు.

వాకిట్లో అడుగుల సవ్వడి అయింది.

తల తిప్పింది రుక్మిణి.

అప్పటికే చంద్రశేఖరం తల్లి తలుపు దాకా వెళ్ళి గాభరాగా, "ఒక్కసారి మీరు త్వరగా లోపలకు రండి!" అన్నది వచ్చి నాయనతో.

ఆయన వింతగా రుక్మిణి ముఖంలోకి ఒక క్షణం చూచి లోపలకు వెళ్ళిపోయాడు.

వెనకగా వచ్చిన చంద్రశేఖరం రుక్మిణికి దగ్గరగా వస్తూ "ఎవరు కావాలి మీకు?" అన్నాడు.

"మీరు చంద్రశేఖరంగారా?" అన్నది లేచి నిలబడుతూ రుక్మిణి.

"అవునండీ!"

"నమస్కారమండీ! నేను శ్యామల అక్కయ్యను—రుక్మిణిని. మీరు అనుకునే కులంగానివాడితో లేచిపోయిన మనిషిని!" అన్నది చిన్నగా నవ్వి.

తడబడ్డాడు చంద్రశేఖరం.

"అబ్బే...బ్బే!..." అన్నాడు ఏదో అనక తప్పదన్నట్లుగా.

"మీరు బాధ పడవలసిన అవసరం ఏమీ లేదు. మీ పరిస్థితులలో ఎవరున్నా అదే చేస్తారు!" అన్నది తాపీగా. "కూర్చుంటాను!"

"కూర్చోండి. అరెరె! అదేమిటి? కూర్చోండి!" అన్నాడు. అతడిలో ఇంకా కలవరపాటు తగ్గనేలేదు.

"చెప్పమ్మా!" అన్నారు చలపతిగారు లోపలినుంచి వస్తూనే.

"నమస్కారమండీ!"

"నమస్కారం! సంగతేమిటి?" అన్నారు, కొట్ట, కొట్ట, తెచ్చె అన్న విధానంలో మాటల్ని తుంచుతూ.

"చెప్పేందు కేమున్నదండీ! ఆడపిల్లల తండ్రి ఈ రోజున ఎన్ని అగచాట్లు పడుతున్నాడో మీకు తెలుసు. అలాంటి ఒక దురదృష్టవంతుడి తరఫున అర్థించేందుకు వచ్చాను!"

"దానికి మేము ఏ విధంగా బాధ్యులం చెప్పమ్మా? పోనీయ్. చూస్తూ చూస్తూ మమ్మల్ని మేము అలాంటి బురదలోకి ఎందుకు తోసుకోవాలో నువ్వు ఆలోచించమ్మా" అన్నారు చిన్నగా నవ్వుతున్నట్లుగా నోటిని విశాలం చేస్తూ.

ఒక్కసారి దీర్ఘంగా నిశ్వాసం విడిచింది రుక్మిణి.

"మామయ్యగారూ! నేను ఒక్కటి చెబుతాను, వినండి. నేను చాలా చిన్నదాన్ని. మీకు చెప్పదగినదాన్ని కాదు. అయినా అవసరం వచ్చింది కాబట్టి చెప్పవలసి వస్తూంది. నేను చేసిన తప్పుకి మరొకరు శిక్ష ఎందుకు అనుభవించాలి? నా చెల్లెలు ఎందుకు బలి కావాలి?"

"సంఘంలో కుటుంబ మర్యాదను నిలబెట్టవలసిన బాధ్యత ఇంట్లో ప్రతి ఒక్కరిదీను. కనక కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు తప్పు చేసినా ఆ కుటుంబమంతా బాధ పడవలసిందే!" అన్నారు నిష్కర్షగా చలపతిగారు. "అది తరతరాలుగా వస్తున్న శాస్త్రం. కాదనే హక్కు ఎవరికీ లేదు!"

ఆయన మాట తీరుకు రుక్మిణికి రోషం వచ్చింది. అయినా, అవసరం తనది. తను రెచ్చిపోతే నష్టపోయేది తనే. అదే మరో సందర్భంలో అయితే తప్పకుండా తను తిరగబడి ఉండేది. కాని, మనస్సును నిగ్రహించుకోలేక తిరగబడితే తన ఈ రాకలోని ఉద్దేశం సమూలంగా నాశనమయినట్లే.

"నా బాధ ఒకటేనండీ. నా మూలంగా శ్యామల జీవితం అధ్వాన్నం కావటానికి వీల్లేదు. అది ఏమీ తెలియని అమాయకురాలు!"

"నీ ఉద్దేశం మంచిదే కావచ్చుగాని, నా చేతుల్లో ఏమీ లేదమ్మా!" అన్నారు నొక్కి చెబుతున్నట్లుగా ఆయన.

అలా మాట్లాడుతున్న ఆయనతోటి తను ఇంకేం మాట్లాడాలో అర్థం కాలేదు రుక్మిణికి.

మనిషిని నీరసం, అందుమీదట కోపం ఆవరించసాగాయి.

కానీ, కోపం తెచ్చుకునే సమయమే కాదు అది. చిట్టచివరిసారిగా ఇక కాదూ అనుకుంటే—ఒక్కసారి వాళ్ళను దులిపేసి బయటికి వెళ్ళిపోవచ్చు.

ఈ రోజు మధ్యాహ్నం తన తండ్రి దగ్గరనుండి తనకు ఉత్తరం వచ్చింది.

"మహా తల్లీ!

నీ సుఖంకోసం చెల్లెలి జీవితాన్ని సమాధి చేశావ్. నీ తల్లిదండ్రుల మనశ్శాంతిని సమాధి చేశావ్. నీ కుటుంబ గౌరవాన్ని సమాధి చేశావ్.

అన్నీ అయినాయి. నీ చెల్లెలి పెళ్ళి పదిహేను రోజుల్లో అయిపోతుందని అనుకుంటున్న మమ్మల్ని నువ్వు చేసిన తప్పుడు పని ఒక అశనిపాతంలా నిలువునా పాతేసింది.


లేచిపోయినదాని చెల్లెల్ని మా ఇంటికి కోడలిగా తెచ్చుకొని మా పరువుని నాశనం చేసుకోలేం అని ఒక ఉత్తరం వ్రాసి మమ్మల్ని మృత ప్రాయుల్నే చేశారు వాళ్ళు.

ఓ మహా తల్లీ! మా సమాధులమీద మొలిచే పిచ్చి మొక్కల పూలే నీ జీవితానికి దీపాల వెలుగులని మురిసిపో!

—నీ తండ్రి అని చెప్పుకోవటానికే సిగ్గుపడుతున్నాను నేను."

తను చేసింది తప్పా?

ఈ క్షణాన—తను సంవత్సరం క్రితం చేసింది తప్పో ఒప్పో సమీక్షించుకోవలసిన అవసరంలేదని అనిపిస్తోంది.



అందుకే భర్తకు చూచాయగా చెప్పి సరాసరి ఇక్కడకు వచ్చింది.

"ఈ సమస్యకు పరిష్కారమే లేదా?" అన్నది దిగులుగా నీరసించిపోతూ.

ఆయన మాట్లాడలేదు.

లేచి నిలబడింది. ఒక వైపున చెల్లెలిమీద జాలి, తల్లితండ్రులంటే వేదన, ఎదుటి మనుష్యులంటే కోపం, అసహ్యం.

కాస్త ముందుకు వంగింది. "రెండు చేతులూ ఎత్తి నమస్కరిస్తున్నాను. నన్ను మన్నించండి. ఇలా చెబుతున్నందుకు మన్నించండి. నా చెల్లెలి జీవితానికి అన్యాయం చేయబోకండి. నేనొకటి చెబుతాను—సాటి మనిషిగా అర్థం చేసుకోండి. సాటి ప్రాణిగా కనికరించండి. సాటి మనిషిగా కాస్త మంచి హృదయంతో మేలు చేయండి. విశాల హృదయంతో ఒక జీవిని ఒడ్డుకు చేర్చండి. మీరు ఆలోచించుకొని మరీ చెప్పండి. నేను జీవితంలో నా కంఠంలో ప్రాణం ఉండగా ఈ గడపనిగాని, నా చెల్లెలి ఇంటి గడపనుగాని, నా తల్లిదండ్రుల గడపనుగాని తొక్కను. నేను బ్రతికి ఉన్నట్లుగానే ఈ ప్రపంచానికి తెలియనీయను. శ్యామల అక్కయ్య చచ్చిపోయినట్లుగా నలుగురిలో ఒక వార్త పుట్టిస్తాను. నేను చచ్చిపోతానండీ. నేను బ్రతకను. నన్ను మన్నించండి. నన్ను అపార్థం చేసుకోకండి. ఈ పెళ్ళినిమాత్రం ఆపబోకండి. శ్యామల జీవితాన్ని నవ్వులపాలు చేయబోకండి!" అన్నది ఆవేశంగా.

చలపతిగారు తడబడ్డారు.

చంద్రశేఖరం ఆవేశంగా లేచి నిలబడ్డాడు.

తలుపు అవతల నిలబడ్డ చంద్రశేఖరం తల్లి భయంతో గుడ్ల నీరు కుక్కుకుంటూంది.

"నా మూలంగా కాక మరేదైనా కారణముంటే నా చెల్లెల్ని మీ కోడల్ని చేసుకోవద్దు. కాని, నేను చేసిన పనికి మాత్రం దాన్ని కాదనబోకండి. కాదంటే నిజంగా నన్ను చచ్చిపొమ్మన్నా చచ్చిపోతాను!" అన్నది లేచి ముందుకు ఒక అడుగు వేసి, తను ఇక బతకను అన్నంత గట్టిగా!

చలపతిగారు మాట్లాడలేక పోయారు.

"నేను ఇక జీవితంలో మా ఇంట్లో గాని, మా వాళ్ళ ఇంట్లో గాని మరోసారి కాలు పెట్టను!" తిరిగి వత్తి పలుకుతూ చెప్పింది.

చలపతిగారు తల వంచుకున్నారు.

"నన్ను చచ్చి పొమ్మంటారా? చెప్పండి. ఈ సమస్యకు నా చావే పరిష్కారమయితే చాలా సంతోషంగా ఆ శిక్షను స్వీకరిస్తాను!" అన్నది వాళ్ళను ఉక్కిరిబిక్కిరి చేస్తూ.

చంద్రశేఖరం మనస్సులోని బాధను దాచుకోలేనట్లుగా, "నాన్నా!" అన్నాడు.

చలపతిగారు లేచి నిలబడ్డారు.

"సరేనమ్మా. ఆలోచిస్తాను. రెండు రోజులు టైమ్ ఇవ్వు నాకు!"

"మీరు ఎలాంటి ఆంక్షలు నా జీవితానికి ఏర్పరిచినా నేను తూచా తప్పకుండా పాటిస్తాను!" అన్నది ఆవేశాన్ని అదుపులో పెట్టుకుంటూ.

"నేను వ్రాస్తానమ్మా. నేను మళ్ళా ఉత్తరం వ్రాస్తాను!"

"నా చెల్లెలికి అన్యాయం చేయరు కదా?" నీరసంగా అన్నది. "అది చాలా అమాయకురాలండీ!"

"మంచిదమ్మా!"

"వస్తానండీ. దాని జీవితంలో వెలిగే దీపమే నాకూ వెలుగు నిస్తుంది!" బయటికి వచ్చేసింది రుక్మిణి—గజిబిజి మనస్సులతో కొట్టుమిట్టాడుతున్న వాళ్ళను అక్కడే వదిలేసి.

బయటికి వచ్చి రిక్షా ఎక్కింది; తన ఇంటికి దారి చెప్పింది.

రుక్మిణికి మనసంతా హాయిగా ఉన్నది.

చలపతిగారిని, చంద్రశేఖరాన్ని ఒప్పించాననే నమ్మకం ఆమెకు పూర్తిగా ఉన్నది.

వాళ్ళు తప్పకుండా ఒప్పుకుంటారు.

వాళ్ళలో ఏ మాత్రం మానవత్వం ఉన్నా తన మాటను తీసివేయలేరు.

ఆ వూహతోనే చీకటిగా ఉన్న తన ఇంటి ముందు కొండంత వెలుగుతో తను కాలు పెడుతున్నట్లుగా రిక్షా దిగింది రుక్మిణి.

దగ్గరగా వేసి ఉన్న గేటును నెట్టుకుని, ఇరవై సంవత్సరాలు తామూ ఒకటై ఆడి మెలిగిన ఆ ఇంట్లోకి ఎవరో పరాయి వ్యక్తి దారి తప్పి వచ్చినట్లుగా తడబడుతూ కాలు పెట్టింది.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉన్నది.

నాన్న ఏమంటాడో తన ఈ రాకకు?

తల్లి ఎంతగా భయపడుతుందో?

తనను వాళ్ళంతా కలిసి నానా చీవాట్లు పెడితే?

పెట్టనీయ్. అసహ్యమున్న చోటే అభిమానమూ ఉంటుంది.

లైటు వెలుగుతున్న వరండాలో కొత్త వ్యక్తిలా నిలబడింది.

"నాన్నా!" ఇంట్లో నించి సమాధానం రాలేదు.

"అమ్మా!" కళ్ళు తిరుగుతున్నాయి.

వాళ్ళను ఎలా పిలవాలి?

ఇంట్లో వాళ్ళెవ్వరూ లేరా?

లోపలి నుంచి సన్నని కూనిరాగం వినబడుతూంది.

అది తన చెల్లెలు శ్యామల.

"చెల్లీ!" గొంతు పెగలనే లేదు.

ఒళ్ళు తూలుతున్నట్లనిపించగా ఇనప కుర్చీ చేతిమీద చెయ్యి వేసి కళ్ళు మూసుకుని ముందుకు వంగితే అది క్రిరుమని శబ్దం చేస్తూ ముందుకు జారింది.

శ్యామల ఆ శబ్దానికి లోపలనుంచి బయటికి వస్తూనే అక్కను చూచి ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసుకున్నది.

"అక్కయ్యా!"

రుక్మిణి నిలదొక్కుకుని నిలబడింది.

"అవును, శ్యామలా, నేను రుక్మిణిని. అమ్మా, నాన్నా ఇంట్లో లేరా?"

శ్యామల దబదబా అక్క దగ్గరకు వచ్చి కౌగిలించుకున్నది.

"అదేమిటే—అక్కడే నిలబడిపోయావ్? లోపలికి రా!"

రుక్మిణికి ఇన్నాళ్ళ తరవాత చెల్లెల్ని చూస్తుంటే ఆనందం ఆగలేదు. ఆవేశం ఆగలేదు. దుఃఖం ఆగలేదు. కన్నీళ్ళతో కళ్ళు బూజర్లు కమ్మసాగినాయి.

"అమ్మేదీ? నాన్నేడీ?"

"వాళ్ళు బాబాయిగారి ఇంటికి వెళ్ళారు. ఇవ్వాళ కమల పుట్టిన రోజే. వచ్చేస్తారు. వచ్చే వేళయింది. పెందరాళే వస్తామన్నారు. నువ్వు లోపలికి పద ముందు!"

పేలవంగా నవ్వింది రుక్మిణి. తన చేతిలో ఉన్న శ్యామల చేతిని మృదువుగా రాస్తూ—"ఈ ఇంటి తలుపులు నేను భాస్కర్‌ని నా భర్తగా ఎన్నుకొని వెళ్ళిన నాడే మూసుకుపోయినాయి. నేను ఇప్పుడు మీ కులందాన్నికూడా కాదు. నేను లోపలికి వచ్చే హక్కే లేదు. నేను మీకు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తంగా కొంతైనా నీకు మేలు చేసిన దాన్నవుతానేమోనని చంద్రశేఖరం దగ్గరికి వెళ్ళి, వాళ్ళను బతిమలాడి వచ్చాను—నా చెల్లెల్ని నా మూలంగా అన్యాయం చేయబోకండని. వాళ్ళు బహుశః నీ వివాహానికి అంగీకరించవచ్చునమ్మా. ఆ విషయం నాన్నకు, అమ్మకు—నేను వాళ్ళకు ఏమీ కానిదాన్నైనా చెప్పి వెళదామని వచ్చాను!" అన్నది, ఆమె మనస్సులోని దంతా ఒక్కసారే చెప్పేయాలి అన్నంత ఆదుర్దాగా తడబడుతూ.

శ్యామల పెదిమలు విరుస్తూ నవ్వింది. "ఛ! పిచ్చిదానా! నువ్వేం చేస్తావే దానికి? అదంతా నా ఖర్మ. ఆహా! అసలు అది నా ఖర్మ అని ఎందుకనుకోవాలి? నా కేం జరిగిందని అసలు? నీ జీవితానికి అది మేలూ అని నువ్వా పని చేశావ్. దానికి నా తప్పేమున్నదే? వాళ్ళకు అలాంటి ఆలోచన ఎందుకు రావాలే? అలాంటి వెధవను చేసుకోవటం నాకే ఇష్టం లేదు అసలు. వెధవ మనుష్యులు, వెధవ ఆలోచనలు. మనకేమే, మన కుటుంబానికేమే! మనం ధైర్యంతో మనకు కావలసిన మార్గాన్ని, మన కానందాన్నిచ్చే మార్గాన్ని ఎన్నుకుంటున్నాం. ఆచారాలు, వంశాలు, పట్టింపులు వంటి వెధవ బురఖాల్లో దూరి బయటికి కనబడని రోగాలతో కుళ్ళి చస్తున్నారే వాళ్ళు. చావనీయ్. రోగ్స్! అలాంటి వెధవ నా కాళ్ళమీద పడి వేడుకొన్నా అతణ్ణి నా భర్తగా అంగీకరించనుగాక అంగీకరించను. నా గురించి నువ్వేం భయపడబోకు!"

శ్యామల మాటల్లో రుక్మిణికి ఒక మెరుపు కనబడి, ఆమె శరీరమంతా ఒక్క వూపు వూపి వెలుగుతో నింపింది. *

